



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 240 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 18-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00

## రాష్ట్రంలో కొత్త డిస్కంకు సర్కార్ ఆమోదం

- ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనిఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌కు ఆదేశం
- సబ్సిడీలు, రైతుల ఉచిత విద్యుత్‌కు కట్టుబడి ఉన్నాం
- జీవోలో స్పష్టం చేసిన ప్రభుత్వం




హైదరాబాద్ డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు ఇందన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం జీవో నెంబర్ 44 విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ఇందన శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంల పరిధి ఎక్కువగా ఉండటం, విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడం వల్ల ఈ

-మిగతా 2 లో



## పార్లమెంటులో మూడు కీలక బిల్లుల ఆమోదం

- వ్యతిరేకించిన ప్రతిపక్షాలు..ఆందోళన
- విస్తృత పరిశీలనకు పంపాలని డిమాండ్
- తిరస్కరించిన అధికార పక్షం
- బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐ బిల్లు కూడా..


న్యూఢిల్లీ
పార్లమెంటు ఉభయ సభల్లో మూడు కీలక బిల్లులను కేంద్రం ఆమోదించింది. ఉపాధి హామీ చట్టం 2005 సవరణ, వీబీ జీ రామ్ జీ బిల్లు, పౌర అణుశక్తి రంగాన్ని ప్రయివేటీకరించే శాంతి బిల్లులను బుధవారం ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే అధికార పక్షం ఆమోదింపజేసుకుంది. రాజ్యసభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య బీమా రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ను అనుమతిస్తూ బిల్లును ఆమోదించారు. ఈ బిల్లుల ఆమోద సమయంలో కేంద్రంపై నిరసన తెలుపుతూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. 'ఉపాధి' సవరణ బిల్లుపై కేంద్రం మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చర్చకు ప్రవేశపెట్టగా, ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లుతో గ్రామీణ ఉపాధి రంగం కుదేలవుతుందని, వలసలు పెరిగి గ్రామీణాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని విమర్శించారు. వీటితో పాటు

-మిగతా 2 లో

# కాంగ్రెస్‌దే పైచేయి

## పంచాయతీల్లో అత్యధిక స్థానాలు కైవసం

- ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ..
- 22న కొత్త సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం
- ప్రశాంతంగా మూడోవిడత పోలింగ్
- హస్తందే హవా ముగిసిన గ్రామీణ పోరు



హైదరాబాద్ డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో జరిగిన పోలింగ్‌లో అన్నింటా హస్తం హవా కొనసాగింది. రాష్ట్రంలో మొత్తం12,728 సర్పంచ్ స్థానాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఇందులో 22 స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండు స్థానాలపై కోర్టు స్టే విధించింది. 1,207 స్థానాలు ఏకగ్రీవం కాగా 11,497 స్థానాలకు పోలింగ్ జరిగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు

-మిగతా 2 లో

## హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

- హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీసీఎం, మంత్రులు
- 22 వరకు రాష్ట్రపతి నిలయంలో బస



హైదరాబాద్ డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ప్రథమ పౌరురాలికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు.

-మిగతా 2 లో

## ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం

- ఇథియోపియా దేశ అత్యున్నత పురస్కారం ప్రదానం


న్యూఢిల్లీ,
భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇథియోపియా దేశ అత్యున్నత పురస్కారం వరించింది. అదిస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. 'ది గ్రేట్ ఆనర్ ఆఫ్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' అవార్డుతో మోదీని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతీయులందరి తరఫునా ఈ అవార్డు స్వీకరిస్తున్నానన్నారు. భారత్-ఇథియోపియా బంధాలను పటిష్ఠం చేసేందుకు సహకరించిన ఎందరో భారతీయులకు ఇది గుర్తింపు అభివర్ణించిన మోదీ.. ఆ దేశ ప్రధాని అబీ అహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ.. తన తొలి ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఇథియోపియా రాజధాని అదిస్ అబాబా చేరుకున్నారు. అంతకముందు.. విమానాశ్రయంలో ఆయనకు అబీ అహ్మద్ అలీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానుల మధ్య పరస్పర ప్రయోజనకర విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. థియోపియాకు వెళ్లడానికి ముందు జోర్డాన్ దేశంలో పర్యటించారు మోదీ. ఆ దేశ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న ఐదేళ్లలో భారత్-జోర్డాన్

-మిగతా 2 లో



# పార్టీ మారినట్టు ఆధారాల్లేవ్

- ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్
- ఎమ్మెల్యేల అనర్హతపై బీఆర్ఎస్ పిటిషన్ల కొట్టివేత..
- సింగిల్ లైన్ స్టేట్‌మెంట్‌తో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీర్పు



హైదరాబాద్ డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీర్పు వెలువరించారు. సాంకేతికంగా ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ సభ్యులుగానే ఉన్నారనీ, వారు పార్టీ మారినట్టు ఎలాంటి ఆధారాలు లేవని తీర్పులో పేర్కొన్నారు. దీనిపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను తిరస్కరించారు. ఎమ్మెల్యే లు తెల్లం వెంకట్రావ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఐదుగురు శాసనసభ్యులు పార్టీ మారినట్టు ఆధారాలు చూపలేకపోయారనీ, అందువల్ల అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవనీ,

-మిగతా 2 లో



## మరో ఏడు దేశాలపై పర్యాటక నిషేధం

- పదిహేను దేశాలపై ప్రవేశ ఆంక్షలు
- అమెరికా ప్రభుత్వ తాజా నిర్ణయం
- జనవరి 1 నుంచి అమలు

వాషింగ్టన్
గతంలో 19 దేశాలపై పర్యాటక నిషేధం, ఆంక్షలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా మరో 20 దేశాలను ఆ జాబితాలో చేర్చారు. ఏడు దేశాలతో పాటు పాలస్తీనీయులపై పూర్తి స్థాయిలో పర్యాటక నిషేధాన్ని విధించారు. మరో పదిహేను దేశాల వారిపై ప్రవేశ ఆంక్షలు పెట్టారు. దేశ భద్రత, ప్రజల రక్షణ, బలహీనమైన తనిఖీ వ్యవస్థలు, అధిక వీసా ఓవర్‌స్టే రేట్లను ఇందుకు కారణాలుగా చూపారు. ట్రంప్ తాజా నిర్ణయంతో పర్యాటక నిషేధం, ప్రవేశ ఆంక్షలు విధించిన దేశాల సంఖ్య 39కి చేరింది.

**నిషేధానికి గురైన దేశాలు**
శ్వేతసౌధం ఫ్యాక్ట్-షీట్ ప్రకారం బర్కినా ఫాసో, మాలీ, నైగర్, దక్షిణ సూడాన్, సిరియా దేశాలపై

-మిగతా 2 లో



## కేంద్ర పథకాలపై దృష్టి పెట్టండి

- ప్రాయోజిత పథకాల్లో వెనకబాటు సరికాదు
- నిధులను సకాలంలో వినియోగించాలి
- అధికారులు, మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి,డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
:కేంద్ర ప్రాయోజిత పథకాలు, నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం నాడు సమీక్ష జరిపారు. కొన్ని శాఖలు, కొన్ని జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం సరికాదని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో అన్నారు. ఖర్చు పెట్టకుండా మిగిలిపోయిన కేంద్ర నిధులను జనవరి 15వ తేదీ నాటికి ఖర్చు పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. సమగ్ర శిక్షా పథకం కింద

-మిగతా 2 లో



## బీజేపీ ఆఫీసుల ఎదుట నిరసన తెలిపితే తాటతీస్తాం

- ఉపాధి హామీ పథకం రద్దు కాలేదు
- పేరు మార్పుపై కాంగ్రెసది రాద్ధాంతం: రాంచందర్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ (నరేగా) ఉపాధి హామీ పథకంపై కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తున్నదని, నిరసన పేరిట బీజేపీ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేస్తే తాట తీస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు హెచ్చరించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం ఎన్టీఆర్ పేరిట ఉన్న శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాజీవ్‌గాంధీ పేరు పెట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని ప్రశ్నించారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం తప్పు కాదని స్పష్టంచేశారు. గతంలో 100 రోజులు ఉన్న ఉపాధి పనులను

-మిగతా 2 లో

# పార్లమెంటులో మూడు కీలక బిల్లుల ఆమోదం

మొదటి తరువాయి

రాష్ట్రాలపై అదనపు భారం కూడా పడుతుందని నొక్కి చెప్పారు. ఈ బిల్లును విస్తృత పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ), సెలక్ట్ కమిటీలకు పంపాలని వారు డిమాండ్ చేశారు. పౌర అణుశక్తి బిల్లుపై ఆ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ చర్చకు ప్రవేశపెట్టగా ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. ఈ రంగం ప్రయివేటు గుత్తాధిపత్యానికి వెళ్తుందని, అదానీ, అంబానీ, టాటా, జిందాల్ వంటి కార్పొరేట్లకు లాభం, జాతీయ భద్రకు ముప్పు వాటిల్లుతుందని ధ్వజమెత్తాయి. ఈ బిల్లును కూడా జేపీసీకి పంపాలని డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌ను తిరస్కరించిన కేంద్రం, తనకున్న సంఖ్యా బలంతో ఏకపక్షంగా ఆమోదించుకుంది. మరో వైపు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ బిల్లును చర్చకు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు దేశ బీమా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, ఈ రంగంపై విదేశీ శక్తుల ఆధిపత్యం పెరుగుతుందని ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. దేశ ప్రయోజనాలకు విఘాతం కలగడంతో పాటు ఎల్ఐసీ వంటి కోట్లాది మంది పాలసీదారులున్న సంస్థలపై ప్రత్యక్ష ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వాడుకలో లేని 71 చట్టాల రద్దు లేదా సవరణకు సంబంధించిన బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టగానే మిగిలిన బిల్లుల తరహాలోనే ఆమోదించుకున్నారు. ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలు చేసిన డిమాండ్లను తిరస్కరిస్తూనే కేంద్రం ఏకపక్షంగా తన సంఖ్యా బలంతో బిల్లులను ఆమోదించుకుంది.

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

మొదటి తరువాయి

ఈ నెల 22 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో హకీంపేట, బొల్లారం, అల్వాల్, తిరుమలగిరి, కారా?నా, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. 19న ఉదయం 11 గంటలకు ఆలిండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును ఆమె ప్రారంభించనున్నారు.

**20,21 తేదీల్లో ఉపరాష్ట్రపతి పర్యటన**

భారత ఉపరాష్ట్రపతి సీ.పీ.రాధాకృష్ణన్ ఈ నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. 20న రామోజీ ఫిలిం సిటీకి వెళ్తారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో పాల్గొంటారు. ఆ రోజు రాత్రి లోక్‌భవన్‌లో బస చేస్తారు. 21న ఉదయం కన్హా శాంతివనంలో నిర్వహించే ప్రపంచ ద్యాన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచే నేరుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని న్యూఢిల్లీ తిరిగి వెళ్తారు. ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సీఎస్ రామకృష్ణారావు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. బందోబస్తు ఏర్పాట్లపై ఆరా తీశారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఏవిధమైన లోటు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం

మొదటి తరువాయి

ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని రెట్టింపు చేసి 500 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకునేలా ప్రయత్నం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం వహించి లబ్ది పొందాలని ఆ దేశ వాణిజ్య సంస్థలను కోరారు మోదీ. ఈ కార్యక్రమంలో ఆ దేశ యువరాజు హుసేన్ సహా వాణిజ్య, పరిశ్రమల శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

### మరో ఏడు దేశాలపై

# పర్యాటక నిషేధం

మొదటి తరువాయి

పర్యాటక నిషేధం విధించారు. పాలస్తీనా అథారిటీ జారీ చేసిన పర్యాటక పత్రాలు ఉన్న వారిని కూడా జాబితాలో చేర్చారు. దీనితో పాటు లావోస్, సియర్రా లియోన్‌పై పూర్తి స్థాయిలో నిషేధం విధించారు. గతంలో ఈ రెండు దేశాలపై పాక్షిక ప్రవేశ ఆంక్షలు ఉండేవి. తాజాగా విధించిన నిషేధం, ఆంక్షలు 2026 జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. ప్రస్తుతం 19 దేశాలపై అమలులో ఉన్న పర్యాటక నిషేధం, ఆంక్షలను 30 దేశాలకు విస్తరించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోందని రెండు వారాల క్రితమే హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం కార్యదర్శి క్రిస్టీ నోయమ్ తెలిపారు. అయితే ఎన్ని దేశాలపై నిషేధాన్ని విధిస్తారో ఆమె అప్పుడు తెలపలేదు.

# బీజేపీ ఆఫీసుల ఎదుట నిరసన తెలిపితే తాటతీస్తాం

మొదటి తరువాయి




కొత్త 'నరేగా' పథకంలో 125 రోజులకు పెంచినట్టు వివరించారు. రాజకీయ లబ్ధి కోసమే గాంధీ పేరును కాంగ్రెస్ వాడుకుంటున్నదని విమర్శించారు. అబద్ధాలను ప్రచారం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని మండిపడ్డారు.

# రాష్ట్రంలో కొత్త డిస్కంకు సర్కార్ ఆమోదం

మొదటి తరువాయి

నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డిస్కంల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు మూడో డిస్కం ఉపయోగ పడుతుందని సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలోనే మూడో డిస్కం ఏర్పాటుకు సంబందించి ప్రభుత్వం విధివిదానాలను ప్రకటించింది. మూడో డిస్కం ఏర్పాటకు సూచించిన విధివిధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్) నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) ప్రభుత్వం ఆదేశించింది. ఎల్‌టీ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వినియోగదారులు, స్మార్టు మీటర్ హోల్డర్లు, మానవ వనరులను మూడో డిస్కంకు కేటాయించాలని పేర్కొంది. సరిహద్దుల నిర్ధారణ, టీజీ జెన్కో, ఇంటర్-స్టేట్ సోలార్, సీజీఎస్, ఐపీపీలతో ఎస్పీడీసీఎల్‌కు 70.55, ఎన్పీడీసీఎల్‌కు 29.45



శాతం ఉన్న పవర్ పర్చేస్ అగ్రిమెంట్‌కు అనుగుణంగా మూడో డిస్కంకు విద్యుత్ కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలని సూచించింది. మూడో డిస్కంకు 600 ఇంజినీర్లు, 1,000 ఆర్టిజన్లు, ఓఅండ్ఎం స్టాఫ్, 340 మంది ఆడ్మినిస్ట్రేషన్ సిబ్బందిని కేటాయించాలని ప్రభుత్వం సూచించింది. మూడో డిస్కం అమల్లోకి వచ్చేనాటికి వాటి ఆస్తులు, అప్పుల ఆధారంగా ప్రత్యేక బ్యాలెన్స్ షీట్‌ను సిద్దం చేయాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

**సబ్సీడీలన్ని మూడో డిస్కం పరిధిలోకే**

వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించే పథకాలన్ని మూడో డిస్కం పరిధిలోకి తీసుకు రానున్నారు. ఇందుకు సంబంధించిన తాజాగా ప్రతిపాదించిన విధివిదానాలకు అనుగునంగా బదిలీ చేయనున్నారు. బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో రెండు డిస్కంలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విద్యుత్ ముసాయిదా బిల్లుకనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సంస్కరించే చర్యల్లో బాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# కాంగ్రెస్‌దే పైచేయి

మొదటి తరువాయి

6,822 స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ మద్దతుదారులు 3,518 స్థానాల్లో గెలిచారు. బీజేపీ 703 చోట్ల, ఇతరులు 1,654 స్థానాల్లో విజయం సాధించారు.

నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ సహా 28 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటింది. ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులు పెద్దఎత్తున గెలుపొందారు. సిద్దిపేట, కుమరంభీం ఆసిఫాబాద్, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆ పార్టీ మద్దతుదారులు గట్టి పోటీ ఇచ్చారు. రెండో విడతలో నిర్మల్ జిల్లాలో అనూహ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వెనక్కి నెట్టి బీజేపీ మద్దతుదా రులు మెజార్టీ స్థానాలను దక్కించుకున్నారు. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాలను దక్కించుకోగా, బీఆర్ఎస్ రెండవ స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 53, బీఆర్ఎస్ 27.5, బీజేపీ 5.5, ఇతరులు 14 శాతం స్థానాలను దక్కించుకున్నారు. సర్పంచ్ స్థానాల్లో గణనీయ మైన స్థానాలు దక్కించుకున్న నేపథ్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు



నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. సర్కార్ మౌఖిక ఆదేశాల మేరకు అధికారులు తగిన కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

**మూడో విడతలో హస్తం 2,246 స్థానాలు**

**బీఆర్ఎస్ 1,162, బీజేపీ 246, ఇతరులు 491 చోట్ల విజయం**

**26 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిక్యం**

**అదిలాబాద్‌తో పాటు 4 జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధిక్యం**

తుది విడత పంచాయతీ ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు దక్కించుకుంది. మొదటి, రెండో విడతల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుని ఊపు మీదున్న ఆపార్టీ.. చివరి విడతలోనూ సత్తా చాటింది. బుధవారం జరిగిన పోలింగ్‌లో 3,752 సర్పంచ్ స్థానాలకు 12,652 మంది, 28,410 వార్డు స్థానాలకు 75,618 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 1,948 స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ మద్దతుదారులు 1,017 స్థానాల్లో గెలిచారు. బీజేపీ 197 చోట్ల, ఇతరులు 417 స్థానాల్లో విజయం సాధించారు. నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ మొదలగు 25 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటింది. కుమరంభీం ఆసీఫాబాద్, మెదక్, గద్వాల జిల్లాల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలకు గెలుచుకుంది. మహబూబ్‌నగర్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతు దారులు గట్టి పోటీ ఇచ్చారు. నిర్మల్ జిల్లాలో రెండో విడతలో అత్యధిక స్థానాలు దక్కించుకున్న బీజేపీ, మూడో విడతలోనూ మెజార్టీ స్థానాలను దక్కించుక

# పార్టీ మారినట్టు ఆధారాల్లేవ్

మొదటి తరువాయి

సాంకేతికంగా ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నట్టుగా తీర్పులో స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు అసెంబ్లీకి వచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్ ప్రకారం మూడున్నర గంటలకు ట్రిబ్యునల్ చైర్మెన్‌గా ఓపెన్ కోర్టులో 'ఈ ఐదుగురు ఎమ్మెల్యేలుగా కొనసాగుతారు' అనే సింగిల్‌లైన్ స్టేట్‌మెంటు' ఇచ్చారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. ఈ తీర్పుతో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీకి భారీ ఊరట లభించింది. బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఓపెన్‌కోర్టులో వెలువరించిన తీర్పు కార్యక్రమానికి రాగా, తీర్పు ఇచ్చిన తర్వాత మీడియా పాయింట్‌కు మరో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు.

**రాజ్యాంగబద్ధ తీర్పు-అసెంబీ కార్యదర్శి**

అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రాజ్యాంగబద్దంగా తీర్పు ఇచ్చినట్టు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు తెలిపారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్‌లు ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్టు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని



వివరించారు. ఈ పిటీషన్‌పై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో ఉన్న ఆరవ పేరాలో అధికారాల ఆధారంగా స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మెన్‌గా వ్యవహరిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు.

**నేడు మరోతీర్పు**

మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో 8 మందికి సంబంధించి స్పీకర్ విచారణ పూర్తిచేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లను సంబంధించిన విచారణ ఇంకా పూర్తికాలేదు. ఆ ఇద్దరు మరింత సమయం కోరడంతో విచారణ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై ఈనెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తిచేసిన స్పీకర్, బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజరుకుమార్‌కు సంబంధించి గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. సుప్రీం తీర్పు సమయానికంటే ముందే స్పీకర్ తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

# కేంద్ర పథకాలపై దృష్టి పెట్టండి

మొదటి తరువాయి

రూ.1363 కోట్లకు రూ.1259 కోట్లు ఖర్చు పెట్టామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. పెండింగులో ఉన్న నిధులను కూడా త్వరితగతిన ఖర్చు పెడతామని మంత్రి లోకేష్ చెప్పారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి రూ.1200 కోట్లు అడిగామని సీఎంకు లోకేష్ వివరించారు . పీఎంఏవై-అర్బన్ నిధులు ఖర్చు పెట్టే అంశాన్ని పర్యవేక్షించాలనని మంత్రి కొలుసు పార్థసారథిని సీఎం ఆదేశించారు. గతంలో విజిలెన్స్ విచారణ కారణంగా పనులు నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలకు వెసులుబాటు కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. తద్వారా పీఎంఏవై -అర్బన్ ఇళ్లకు మరింతగా ఖర్చు పెట్టే అవకాశం ఉంటుందన్నారు. 'వివిధ సీఎస్ఎస్ పథకాల ద్వారా రూ. 24,513 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. ఇంకా రూ. 6,252 కోట్ల నిధులు ఖర్చు పెట్టలేదు. ప్రభుత్వ శాఖలు కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకోవటంలో ఎందుకు వెనుకపడుతున్నాయని ప్రశ్నించారు. ఏడాది చివరిలో కేంద్రంలోని వివిధ శాఖల వద్ద నిధులు ఉండిపోతున్నాయి. వాటిని సమర్థంగా వినియోగించుకోవాలి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్‌లో కేవలం 38 శాతం మాత్రమే ఖర్చు చేయడం ఏంటీ? జనవరి నాటికి పీఎంఏవై అర్బన్‌లో 75 శాతం నిధులు ఖర్చు చేస్తే అదనంగా కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు కూడా ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ నిధులను త్వరితగతిన ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలి. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు, రాష్ట్ర కృషీ వికాస్ యోజన కింద కూడా త్వరితగతిన నిధులు వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన మిగతా నిధులను కూడా కేంద్రం నుంచి సాధించే అవకాశం ఉంటుంది. నిధులు లేక ఓ వైపు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర పథకాల్లో ఉన్న నిధులను ఖర్చు చేయకపోవడమేంటీ..? ఎట్టి పరిస్థితుల్లో కేంద్రం కేటాయించిన రూ.24,513 కోట్లు ఖర్చు చేయాల్సిందే. కేంద్ర నిధులు ఖర్చు చేస్తే మరో రూ.5 నుంచి 6 వేల కోట్లు అదనంగా తెచ్చుకుందాం. ఈ ఏడాది కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ. 30 వేల కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకోండి. కేంద్రంలోని సంబంధిత మంత్రులతో టచ్ లోకి వెళ్లండి. బడ్జెట్ ప్రిపరేషన్ సమయంలోనే కలిస్తే ఏపీకి అదనంగా నిధులు సాధించుకునే అవకాశం ఉంటుంది. ఈ నెలలోనే బ్జడెట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలూ తయారీ మొదలు పెడతాయన్నారు. 63 వేల ప్రభుత్వ ఖాతాలు ఇన్ యాక్టివ్‌గా ఉన్నాయి. ఇన్ యాక్టివ్‌గా ఉన్న ఖాతాల్లో రూ.155 కోట్ల మేర నిధులు బ్యాంకుల్లో ఉండిపోయాయి. ఆ నిధులను విత్ డ్రా చేయించండి. బ్యాంకుల్లో ఉండిపోయిన నిధులకు సింపుల్ వడ్డీ అయినా వచ్చేలా చూడండి.

# పెన్షనర్స్ డే వేడుకలు



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఎల్లాపు ఎంప్లాయిస్ మరియు రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డ్ అయిన వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు పెంచాల సుధాకర్ రావు మాట్లాడుతూ ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత కూడా సమాజానికి సేవ చేస్తూ, నలుగురితో కలిసిమెలిసి ఉంటేనే నిజమైన సంతృప్తి కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్క రాజేశ్వర్ రావు, సహా అధ్యక్షులు గందె పరశురామారావు, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు పెంచాల మురహరి రావు, ప్రధాన కార్యదర్శి లక్కాకుల సురేందర్ రావు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# శాతవాహన న్యాయ కళాశాలలో స్పోర్ట్స్ లాంజ్ ప్రారంభం






**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శాతవాహన విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో స్పోర్ట్స్ లాంజ్‌ను ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఆటలు ఆడుతూ ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందించుకోవాలని సూచించారు. వచ్చే ఏడాదిలో న్యాయ కళాశాలకు కొత్త భవనం నిర్మించడంతో పాటు పురుషులు, మహిళలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ ఆడారు. ఈ కార్యక్రమంలో న్యాయ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సూరేపల్లి సుజాత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మున్వర్, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ యువకుడు అమన్ రావు ఐపీఎల్‌కి ఎంపిక

**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




: కరీంనగర్ నగరానికి చెందిన పేరాల అమన్ రావు మొట్టమొదటిసారిగా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు ఎంపిక కావడం హర్షనీయమని మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. అమన్ ఇప్పటికే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అండర్ 19, అండర్ 23 టోర్నమెంట్లలో ప్రతిభ కనబరిచాడని, ముఖ్యంగా ముస్తాక్ అలీ టోర్నీలో 160 స్ట్రైక్ రేట్‌తో 250 పైగా పరుగులు సాధించి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నాడని ఆయన పేర్కొన్నారు.కరీంనగర్ హిందూ క్రికెట్ టీంకు చెందిన మధుకర్ రావు కుమారుడైన అమన్, రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లో ఆడబోతున్నాడు. అతని ప్రదర్శనతో జిల్లా, రాష్ట్రం పేరు నిలబెట్టాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విదేశీ పాస్‌పోర్ట్ సమస్యను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తక్షణమే పరిష్కరించి అమన్ ఆక్షన్‌లో పాల్గొనేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అమన్ రావు విజయవంతమైన ప్రదర్శన ఇవ్వాలని కరీంనగర్ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.


# ప్రశాంతంగా మూడవదశ గ్రామపంచాయతీ ఎన్నికలు



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మూడవదశ గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా సాగుతున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా పలు మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో క్యూ లైన్ పరిస్థితులు, బందోబస్తు తీరును పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగాలని ఆయన సూచించారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పనితీరును సమీక్షించిన సీపీ, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

# క్రిస్మస్ లోపు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల పెండింగ్ జీతాలను క్రిస్మస్ పండగకు ముందే విడుదల చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ వీర రెడ్డిని యూనియన్ ప్రతినిధులు కోరారు. డిసెంబర్ 25న క్రిస్మస్ పండగ ఉన్నందున ఆ లోపు వేతనాలు ఇవ్వాలని విన్నవించిన ఈ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్, ఆసుపత్రి అధ్యక్షులు అరుణ్, రాజు, రాజయ్య పాల్గొన్నారు.

# సర్పంచులు మంత్రులను కలిసిన వేడుక



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇటీవల గెలిచిన కరీంనగర్ నియోజకవర్గ సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లను కలిశారు. మంత్రులు సర్పంచులను అభినందిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి వాటి ప్రయోజనం అందేలా చూడాలని సూచించారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని, అవసరమైన నిధుల అంచనాలు రూపొందించి సమర్పించాలని మంత్రులు సూచించారు. సర్పంచుల విజయానికి సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చర్లభూత్కూర్, చామనిపల్లి, దుబ్బపల్లి, బహదూరా?న్‌పేట్, జూబ్లీ నగర్, ఎలబోతారం, ఫకీర్‌పేట్, చేగుర్తి, నల్లగుంటపల్లె సర్పంచులు, ఉపసర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు కాంరెడ్డి రాంరెడ్డి, పంజాల స్వామి గౌడ్, పెంచాల లక్ష్మణ్ రావు, బుర్ర నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగించిన ఎమ్మెల్యే విజయరమణ రావు

**పెద్దపల్లి, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందరరేగా ఎలిగేడు మండలంలోని తన స్వగ్రామం శివపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రజలతో మాట్లాడారు.ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ, గత రెండు విడతల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధించారని, ప్రస్తుతం జరుగుతున్న మూడో విడతలో కూడా అదే విజయాన్ని సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉదయం నుంచే ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరి ఓటు వేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివ ృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని, ఇప్పటికే పది సంక్షేమ పథకాలను అమలు చేశామని, రానున్న మూడు సంవత్సరాల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతామని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాలను అభివ ృద్ధి చేసి, సంక్షేమాన్ని అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఓటమి తర్వాత కొత్త ఆశలు




**పాలకుర్తి, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇటీవల జరిగిన రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన పలువురు సర్పంచ్ అభ్యర్థులు ఇప్పుడు ఎంపీటీసీ లేదా జెడ్పీటీసీగా పోటీకి సిద్ధమవుతున్నారు. ఓటమిని వెనుకడుగు కాకుండా స్ఫూర్తిగా తీసుకుని, రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలిస్తే బరిలో నిలవాలని ధైర్యంగా ముందుకు వస్తున్నారు.పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన అనేక మంది సర్పంచ్ అభ్యర్థులు ఓటమి పాలైనప్పటికీ, ప్రజలు గ్రామాల అభివృద్ధి కోసం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో వారినే గెలిపించాలని చర్చించుకుంటున్నారు. కొందరు రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నా, ఓటమి చెందిన అభ్యర్థులకే ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున గ్రామాల అభివృద్ధి కోసం అధికార పార్టీ అభ్యర్థులకే ప్రజలు మొగ్గు చూపుతున్నారని స్థానికంగా చర్చనీయాంశమైంది.

# వెల్ది సర్పంచ్‌గా విజయం సాధించిన పెంచాల కిషన్‌రావుకు ఘన సన్మానం



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మానకొండూరు మండలం వెల్ది గ్రామ సర్పంచ్‌గా భారీ మెజార్టీతో విజయం సాధించిన పెంచాల కిషన్‌రావును డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం వాకర్స్ మరియు వాకర్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 304 ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గత 15 సంవత్సరాలుగా అంబేద్కర్ స్టేడియంలో వాకింగ్ చేస్తూ వాకర్స్‌తో స్నేహభావంగా ఉంటూ, సమాజ సేవలో ముందుండే కిషన్‌రావు సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని పూలమాలలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానం చేశారు.

# వరంగల్‌లో అయ్యప్ప స్వామి పడి పూజ

**వరంగల్ తూర్పు, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



బిజెపి రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పలు అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి పూజలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు.

# ఈశాల తక్కల్లపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

## మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**పాలకుర్తి, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇటీవల రెండవ విడత పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన నూతన పాలకవర్గాన్ని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు



తెలిపారు.ఈ సందర్భంగా ఆయన నూతన సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ తో పాటు వార్డు సభ్యులకు పలు సూచనలు చేస్తూ, అందరూ కలిసి కట్టుగా పనిచేసి ఈశాల తక్కల్లపల్లి గ్రామాన్ని రామగుండం నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు.గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన సహాయ సహకారాలన్నీ బీఆర్ఎస్ పార్టీ తరఫున అందిస్తామని మాజీ ఎమ్మెల్యే చందర్ హామీ ఇచ్చారు.

# బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ఓల్డ్ హై స్కూల్‌లో "బాల్ వివాహ ముక్త్ భారత్" వంద రోజుల ప్రణాళికలో భాగంగా బాల వివాహాల నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్హత వయసు, చట్టపరమైన అంశాలపై వివరించి, బాలల భవిష్యత్తు కోసం బాల్యవివాహాలను అరికట్టాల్సిన అవసరాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నుండి సాదినేని రమేష్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. విద్యార్థులు చురుకుగా స్పందించి బాల్యవివాహాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

## 27వ సారి ఆదర్శవంతమైన రక్తదానం




**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జగిత్యాల జిల్లా వనిత ప్రసవించిన 7 నెలల పాప కరీంనగర్ మాత శిశు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఐసీయూలో ఉన్న ఈ 12 రోజుల పాపకు అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమని కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతుండగా, రక్తదాతల అనుసంధాన కర్త గాలిపెల్లి కుమార్ సహకరించారు.అదే సమయంలో కరీంనగర్ అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉన్న మామిండ్ల కిరణ్ స్వామి, శబరి దర్శనానికి బయలుదేరుతున్నప్పటికీ పాపకు రక్తం ఇవ్వడానికి ముందుకు వచ్చి ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో 27వ సారి ఏ పాజిటివ్ రక్తదానం చేశారు. అయ్యప్ప మలధారణలో ఉండి కూడా వెంటనే స్పందించి రక్తదానం చేసిన ఆయనను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, సామాజిక సేవకులు, పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

## గ్రామ పంచాయతీ విజేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కారం



**హుస్నాబాద్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురు మామిడి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించి సత్కరించారు.ఇందుర్తి గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, కొండాపూర్ సర్పంచ్ మార్క రాజు గౌడ్, లంబాడిపల్లి సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, నవాబ్‌పేట సర్పంచ్ గుళ్ళ రజిత, ఓగులపూర్ సర్పంచ్ గడ్డం రమాదేవి, సీతారాంపూర్ సర్పంచ్ గోగూరి లక్ష్మీ, ఉల్లంపల్లి సర్పంచ్ అలువల శంకర్‌తో పాటు ఉప సర్పంచులు, వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు. గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని సూచిస్తూ, సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**జమ్మికుంట, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యక్షంగా పరిశీలించారు. జమ్మికుంట మండలంలోని మాచనపల్లి, జగ్గాయ్యపల్లి కేంద్రాలను సందర్శించి కౌంటింగ్ పనితీరును సమీక్షించారు. అలాగే వీణవంక మండలంలోని రెడ్డిపల్లి, చల్లూరు, మామిడాలపల్లి కేంద్రాల్లో కూడా కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

# ప్రశాంతంగా ముగిసిన చివరి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లాలో మూడు దశల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. మొదటి, రెండవ విడతల మాదిరిగానే మూడవ విడత పోలింగ్ కూడా ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా సాగిందని ఆమె పేర్కొన్నారు. మూడవ విడతలో మొత్తం 86.42 శాతం పోలింగ్ నమోదైంది. మండలాల వారీగా చూస్తే ఇల్లందకుంటలో 87.05%, హుజురాబాద్‌లో 85.04%, జమ్మికుంటలో 85.72%, వీణవంకలో 85.87%, సైదాపూర్‌లో 87.85% పోలింగ్ నమోదైంది. కలెక్టర్ సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, ఎలబోతారం, హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.పోలింగ్ అనంతరం జమ్మికుంట మండలంలోని మాచినపల్లి, జగ్గయ్యపల్లి, వీణవంక మండలంలోని రెడ్డిపల్లి, చల్లూరు, మామిడాలపల్లి గ్రామాల్లో కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో నిష్పక్షపాతంగా కౌంటింగ్ జరగాలని సూచిస్తూ, ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# కాజీపేటలో పెన్షనర్స్ డే వేడుకలు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ పాల్గొనడం




**కాజీపేట, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెన్షనర్స్ డే సందర్భంగా కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి తమ జీవితాన్ని అంకితం చేసిన పెన్షనర్ల సేవలు అమూల్యమని, ప్రభుత్వ శాఖల్లో నిబద్ధతతో పనిచేసిన వారి కృషి వల్లే వ్యవస్థలు బలంగా నిలబడ్డాయని అన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా సమాజానికి మార్గనిర్దేశకులుగా ఉండే పెన్షనర్ల అనుభవం యువతకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పలువురు సీనియర్ పెన్షనర్లను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో సర్వ సభ్య సమావేశం అదే రోజు కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మీరు సేవలో ఉన్న రోజుల్లో చేసిన కృషి వల్లే ఈ విశ్వవిద్యాలయానికి గౌరవం, ప్రమాణాలు ఏర్పడ్డాయి. పదవీ విరమణతో బాధ్యతలు ముగిసినా, అనుభవం ముగియదు. సమాజానికి మీరు ఇంకా మార్గదర్శకులే" అని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, పెన్షన్, వైద్య సదుపాయాలు, ఇతర హక్కులు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగుల సూచనలు కీలకమని, యూనివర్సిటీకి సంబంధించిన ప్రతి న్యాయమైన డిమాండ్‌కు తన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కాకతీయ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించేలా జిల్లా ప్రతినిధులందరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలక మండలి ఈసీ సభ్యులు చిర్ర రాజు, ఆర్టీఏ మెంబర్ పల్లకొండ సతీష్, రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘ అధ్యక్షులు సదానందం, కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మూడో విడత ఎన్నికలు



**మంచిర్యాల, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లాలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కుమార్ దీపక్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం, భీమారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు.చెన్నూర్, మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 102 సర్పంచ్ స్థానాలకు 390 నామినేషన్లు వచ్చి, 4 ఏకగ్రీవం కాగా 98 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వార్డు సభ్యుల 868 స్థానాలకు 1,905 నామినేషన్లు వచ్చి, 153 ఏకగ్రీవం కాగా 711 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. జిల్లాలో 1,06,889 మంది ఓటర్లలో 93,822 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 87.78 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, విజయోత్సవాలు నిర్వహించరాదని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, అధికారులు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పారదర్శకంగా ఎన్నికలు జరిగాయని కలెక్టర్ తెలిపారు.

## గోనబోయినపల్లి సర్పంచ్ గా బాలనారాయణ

నాడు దేశ సేవలో నేడు గ్రామసేవకుడిగా.



**దేవరకొండ డిసెంబర్ 17.(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి సర్పంచ్ గా వర్కాల బాలనారయణ విజయ దుందుభి మోగించారు.నాడు దేశం కోసం ఆర్మీ లో వివిధ హోదాల్లో సేవచేసిన మాజీ సైనికుడు నేడు గ్రామసేవకుడిగా ఎంపిక కావడం చాలా గర్వించదగ్గ విషయం.తన సమీప అభ్యర్థి పైన 425 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.తన గెలుపు కు సహాకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.తనకు అండగా వార్డు సభ్యులు ఓటర్లకు రుణపడి ఉంటానని మీకు సేవకుడిగా పని చేస్తానని అన్నారు.

## జాతీయ పెన్షనర్స్ డే ఘనంగా



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోల సంఘ భవనంలో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీపీసీఏ అసోసియేషన్ అధ్యక్షులు పెండ్యాల కేశవ రెడ్డి, ఎలదాసరి లింగయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ పాల్గొన్నారు.కార్యక్రమ ప్రారంభంలో కీర్తిశేషులు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పెన్షన్ అనేది భిక్ష కాదని, ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు సమిష్టి పోరాటం అవసరమని పిలుపునిచ్చారు.అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ మాట్లాడుతూ, పెన్షనర్లు ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి పెన్షనర్ల సంఘ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. దాదాపు 800 మంది పెన్షనర్లు హాజరైన ఈ వేడుకలో 80 మంది సీనియర్ సిటిజన్లను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.

## హుజురాబాద్ ఎమ్మెల్యే ఓటు హక్కు వినియోగం



**హుజురాబాద్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలంతా తప్పనిసరిగా ఓటు వేయాలని సూచించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం బిఆర్ఎస్ అభ్యర్థులను సర్పంచ్ స్థానాల్లో గెలిపించాలని కోరుతూ, గత రెండు విడతల్లో పార్టీ గణనీయ విజయాలు సాధించిందని, మూడవ విడతలో కూడా అధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సిద్దిపేటలో మూడో విడత ఎన్నికల పరిశీలన

**సిద్దిపేట, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోహెడ మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి, బస్వాపూర్ గ్రామాలు, అలాగే కొండపాక మండలంలోని మర్పడగ, సిర్సనగండ్ల, దుద్దేడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 150 గ్రామాల్లో 1182 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగిందని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై చిన్న గ్రామాల్లో సాయంత్రం 6



గంటల వరకు, పెద్ద గ్రామాల్లో రాత్రి వరకు ఫలితాలు వెలువడతాయని చెప్పారు. ఎన్నికల మోడల్ కోడ్ ఉల్లంఘన కింద ఇప్పటివరకు 350కి పైగా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వాహనాలు, గుంపులు లేకుండా కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టాలని పోలీసులకు ఆదేశించారు. మధ్యాహ్నం 1 తర్వాత లైన్‌లో ఉన్నవారికే ఓటు వేసే అవకాశం కల్పించాలని, పోలింగ్ సెంటర్‌లో ఫోన్ అనుమతి లేదని, చెక్ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జిల్లాలో పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారని కలెక్టర్ హైమావతి తెలిపారు.

# నిజామాబాద్‌లో సర్పంచ్, వార్డు సభ్యుల సన్మానం



**నిజామాబాద్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మల్లారం గ్రామ సర్పంచ్ అన్నం గోపి, వార్డు సభ్యులు జిల్లా కేంద్రంలోని డి.ఎస్.ఎన్ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణను కలిశారు. ఎమ్మెల్యే వారిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బాన్సువాడ నియోజకవర్గం మోస్రా గ్రామ సర్పంచ్‌గా గుత్పే భూపాల్ రెడ్డి విజయం సాధించడంతో ఆయనను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా బిజెపి అభ్యర్థులు గెలుపొందాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధికి ముందుండి కృషి చేయాలని సూచించారు. పార్టీ అధిష్టానం కార్యకర్తల నుండి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వరకు ఒకే దృష్టితో పనిచేస్తుందని, గెలిచిన అభ్యర్థులు ప్రజల్లోకి కాంగ్రెస్ అవినీతిని విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన అన్నారు. బిజెపి తరఫున గెలిచిన వారికి ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తామని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తే దేశం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు.

# బిజెపి అభ్యర్థుల విజయకేతనం



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు పలు ప్రాంతాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డి పల్లె సర్పంచ్ స్థానంలో చిన్నమ్మ నేని మౌనిక -కిషన్ విజయం సాధించగా, గంభీరావుపేట్ మండలం పొన్నాల పల్లె సర్పంచ్‌గా పొన్నాల మహేష్ గెలుపొందారు. అదేవిధంగా వీర్నపల్లి మండలం శాంతినగర్ గ్రామ సర్పంచ్ స్థానంలో మాలోత్ పుష్పలత-లక్ పతి నాయక్ విజయం సాధించారు. ఈ సందర్భంగా బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి అభ్యర్థులను అభినందిస్తూ, గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.

# ఐదో వార్డు ను అభివృద్ధి చేస్తా

## గుండె కవిత సుధాకర్

**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ లోని లష్కర్ గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఐదో వార్డు నుండి పోటీ చేసిన గుండె కవిత సుధాకర్ 30 ఓట్లతోని ఘన విజయం సాధించడం జరిగింది అనంతరం కవిత మాట్లాడుతూ నాపై నమ్మకంతోని ఓట్లు వేసి గెలిపించిన ఓటర్ మహాశయులకు నా వార్డు ఓటర్ మహాశయులకు ధన్యవాదాలు తెలుపుకుంటాను ఎప్పటికప్పుడు వార్డులో సమస్యను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తానని వార్డుని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆమె చెప్పడం జరిగింది.

# గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమీక్ష




**హైదరాబాద్, డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం బుధవారం జరిగింది. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. లలితాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో చట్ట అమలు స్థితిగతులు, స్కాన్ కేంద్రాల పనితీరు, లింగ నిర్ధారణ నిరోధానికి తీసుకుంటున్న చర్యలపై సవివరంగా చర్చ జరిగింది. జిల్లాలో కొత్తగా ప్రారంభించేందుకు దాఖలైన 19 అల్ట్రాసౌండ్ స్కాన్ కేంద్రాల దరఖాస్తులతో పాటు ఇప్పటికే పనిచేస్తున్న 20 స్కాన్ కేంద్రాల పునరుద్ధరణ దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమతులపై తుది నిర్ణయం కోసం జిల్లా స్థాయి సమర్థ అధికారి వద్దకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ, లింగ నిర్ధారణ వంటి అక్రమ చర్యలకు ఎలాంటి అవకాశమూ లేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల హక్కులు, బాలికల భవిష్యత్తు పరిరక్షణే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, డాక్టర్ వినోద్, డాక్టర్ రాకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొని చట్ట అమలుపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

# పెళ్లిరోజు సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆటవస్తువుల పంపిణీ




**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బొమ్మకల్ 6వ డివిజన్ నాయకులు, ది లీడర్ నేతాజీ కపిల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సామాజిక సేవకులు లయన్ మిడిదొడ్డి శ్రీలత కపిల్ మాధవ దంపతులు తమ 11వ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో ప్రత్యేకంగా జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో, బొమ్మకల్ 6వ డివిజన్ పరిధిలోని బొమ్మకల్, గోకుల నగర్, గుంటూరు పల్లి, ప్రియదర్శిని కాలనీ అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అవసరార్థం ఆటవస్తువులను అందజేశారు. పిల్లల ఆనందభరితమైన కిలకిలరావాలతో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా ఆయా అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు లయన్ మిడిదొడ్డి శ్రీలత కపిల్ మాధవ దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారి సేవా భావాన్ని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బొమ్మకల్ సభ్యులు బట్టు రాజేందర్, కాంరెడ్డి నరసింహారెడ్డి, చింతల కిషన్, తాటి పూర్ణచందర్, ఆసిరి సుమన్, మ్యాకల వెంకటేష్, కాల్వ శ్రీనివాస్, బూస సాయి కృష్ణ, కముటం మహేష్, మంద దిలీప్ రెడ్డి, తోట విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో 'శాంతి బిల్లు'పై తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ/పెద్దపల్లి, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అణుశక్తి రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా రూపొందించిన 'శాంతి బిల్లు' దేశ భద్రతకు ముప్పు అని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్‌లో మండిపడ్డారు. చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శాంతి బిల్లు అని పేరు పెట్టినా, ఇందులోని అంశాలు దేశానికి అశాంతిని తెస్తాయి. అణు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? సరఫరాదారులపై బాధ్యత తొలగిస్తే ప్రజల ప్రాణాలకు ఎవరు హామీ ఇస్తారు?" అని ప్రశ్నించారు. ఫ్రాన్స్, రష్యా, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో అణుశక్తి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉందని గుర్తుచేస్తూ, భారత్‌లో ప్రైవేటీకరణ ప్రమాదకరమని హెచ్చరించారు. అదానీ గ్రూప్ ఆసక్తి చూపిన వెంటనే ఈ బిల్లు రావడం యాదృచ్ఛికమా అని ప్రశ్నించిన ఆయన, గత పదేళ్ల తప్పిదాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి రంగంలో ప్రైవేటీకరణ విఫలమైందని పేర్కొంటూ, ఈ బిల్లును పునఃపరిశీలించి ప్రైవేట్ సంస్థలు, సరఫరాదారులపై కఠిన బాధ్యతలు విధించాలని డిమాండ్ చేశారు.

# హుజురాబాద్‌లో ఓటు హక్కు వినియోగించిన కాంగ్రెస్ ఇన్చార్జి ప్రణవ్



**హుజురాబాద్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో హుజురాబాద్ మండలంలోని సింగపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో సురక్షిత పాలనకు నాంది పలకాలని, గ్రామం బాగుంటే దేశం బాగుంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధి వినాయక కాలనీ పర్యటన



**హయత్‌నగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సిద్ధి వినాయక నగర్ కాలనీలో పర్యటించారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్ పనులను పరిశీలించి, కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలోని పలు వీధుల్లో భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని నివాసులు వివరించగా, కార్పొరేటర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పైప్‌లైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు దుర్గాప్రసాద్, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, చరణ్, కనకారావు, లింగం, భాస్కర్, భీమరాజు, వేణుగోపాల్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఆర్యవైశ్య ముద్దుబిడ్డ విజయకేతనం



**కరీంనగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వీణవంక మండలం గంగారాం గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి తరఫున సర్పంచ్‌గా తణుకు సంధ్య సందీప్ విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ తరఫున ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమరవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు సాయికృష్ణ విజయాన్ని శుభాకాంక్షలతో ఘనంగా అభినందించారు.

# విద్యార్థులు ఆటల్లో ప్రతిభను చాటాలి

-చీర్ల అనూష భాస్కర్ యాదవ్



**మనోహరాబాద్, డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని స్థానిక క్రీడా మైదానంలో సాఫ్ట్ బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులను నూతన గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ కలిశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఐదు రోజుల శిక్షణలో భాగంగా వారిని పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “పిల్లలు చదువుతో పాటు ఆటల్లో కూడా తమ ప్రతిభను చాటాలి. విద్యార్థులు, క్రీడాకారుల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను” అని తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ టెక్మాల్ వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు నిమ్మల యాదగిరి యాదవ్, భాస్కర్ యాదవ్, అజయ్ కుమార్, గోవర్ధన్ గౌడ్, చిన్న యాదవ్, రేణుకుమార్, వెంకట్‌తో పాటు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ విద్యార్థుల ఘన విజయం

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ స్థాయిలో నిర్వహించిన “నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025” పోటీల్లో నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి పాఠశాలకు గర్వకారణమయ్యారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు మొత్తం 3 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేశారు.ఈ పోటీలు ఆదివారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఘనంగా నిర్వహించబడగా, ప్రముఖ సినీ నటుడు డా. సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ కూడా అతిథిగా హాజరై, విద్యార్థుల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు నిరంతర సాధన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలకు దారి తీస్తాయని ప్రశంసించారు.అదేవిధంగా, 130వ



డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి నాలెడ్జ్ ఐకాన్ స్కూల్‌ను సందర్శించి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పిల్లలకు శిక్షణ అందించిన మాస్టర్ బాలు ప్రసాద్, మాస్టర్ శైలజ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రతిభను వెలికి తీస్తున్న నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ యాజమాన్యం, శిక్షకులకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలకు నాంది పలకాలని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.


# సర్పంచ్ కూరాకుల చిన్న రామయ్యకు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఘన సన్మానం



**అడవిదేవులపల్లి,డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన అడవిదేవులపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కూరాకుల చిన్న రామయ్య ఈరోజు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సర్పంచ్‌లుగా, ఉప సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలుపొందిన వారందరికి శుభాకాంక్షలు తెలియజేసి, వారిని శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.అడవిదేవులపల్లి మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, గ్రామపంచాయతీల అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గోపగాని హనుమంతు, కొట్ర ఆంజనేయులు, పసుపులేటి హనుమంతరావు, చెవిటి సైదయ్య, గండు సాంబశివరావు, గొడుగు అన్నమయ్య, కలకొండ హరీష్ తదితర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

-పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా
-అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి రూ, 51 వేల విరాళం అందజేత



**కడ్తాల్, డిసెంబర్ 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఆధ్యాత్మిక చింతనతో మానవుడికి మానసిక ప్రశాంతత లభిస్తుందని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల మండలంలోని రావిచెడు గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఇరుముడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గానుగు మార్ల తాండ సర్పంచ్ బాణావత్ సేవ్య నాయక్, రావిచేడు సర్పంచ్ బొప్పిడి గోపాల్, కడ్తాల మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డిలు ఇరుముడి మహా పడిపూజలో పాల్గొన్నారు. గురు స్వాములు మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, గురు స్వామి జితేందర్ రెడ్డి గ్రామంలో అయ్యప్ప మహా పడిపూజ ఇరుముడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా పాల్గొని అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 51, 000/- వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు. అనంతరం గంప వెంకటేష్ గుప్తా అన్న ప్రసాదం ( బిక్ష) స్వాములకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు రవికుమార్, హనుమంతు నాయక్, భూపతి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, నాయకులు బాలకృష్ణ, జితేందర్ రెడ్డి, రాములు, వెంకటేష్, సాయికుమార్, బాలకృష్ణ, లింగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కట్టుదిట్టమైన బందోబస్తుతో ముగిసిన వనపర్తి జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలు



శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామం మోడల్ పోలింగ్ కేంద్రం ను పరిశీలించిన కలెక్టర్



మూడో విడతలో జరిగిన పోలింగ్ ప్రక్రియను సమావేశ మందిరం నుంచి వెబ్ కాస్ట్ ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్

**వనపర్తి,డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లాలో బుధవారం నిర్వహించిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. పానగల్, పెబ్బేరు, శ్రీరంగాపూర్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా సాగినట్లు పేర్కొన్నారు.ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, సాధారణ ఎన్నికల పరిశీలకులు మల్లయ్య భట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్‌లతో కలిసి పర్యవేక్షించారు.అదేవిధంగా జిల్లా కలెక్టర్ శ్రీరంగాపూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలోని మోడల్ పోలింగ్ కేంద్రం, శ్రీరంగాపూర్ మండల కేంద్రం, పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది.కంచిరావుపల్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లందరికీ క్యూ లైన్లలో అవకాశం కల్పించి ఓటు వేయించామని తెలిపారు.మూడో విడతలో పోలింగ్ జరిగిన ఐదు మండలాల్లో మొత్తం 1,11,357 ఓట్లు పోలవగా, 85.55 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# దైవ స్మరణ దైవనుగ్రహం తోనే సన్మార్గం

-సన్నిధానం నిర్మాణానికి 1 లక్ష రూపాయలు విరాళం
- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, డిసెంబర్ 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కడ్తాల్ మండలం గడ్డమీది తండా గ్రామ పంచాయతీ లో అయ్యప్ప స్వాముల సన్నిధానం నిర్మాణానికి 1 లక్ష రూపాయల విరాళం, కొంత మెటీరియల్ అందించిన టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దైవ కార్యం, దైవ స్మరణ, మానవాళి ని సన్మార్గం లో నడిచే విధంగా తొడపడుతుంది అని మానసిక ప్రశాంతత దొరుకుతుంది అని దేవుడు స్మరణ వలన మనిషి భయం భక్తి తో న్యాయబద్ధంగా నడుచుకుంటూ మంచి దారిలో నడుస్తాడని ప్రేమ, దయ, జాలి అన్ని సుగుణాలు పెంపొందించుకుంటాడని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గడ్డ మీది తండా చిన్న తండా అయినా సరే 25 లక్షలతో సన్నిధానం ఏర్పాటు చేస్తుండడం గొప్ప విషయం అని ఇంకా నా తోడ్పాటు ఉంటదని అయ్యప్ప స్వాములకు తెలిపి వారిని అభినందించడం జరిగింది. ప్రభుత్వం సహితం గుళ్ళు, గోపురాలకు పెద్ద పీట వేస్తుందని అయన అన్నారు ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ లు హీరా సింగ్ నాయక్, పంత్య నాయక్, అయ్యప్ప స్వాములు కిషన్ స్వామి, సుధీర్ స్వామి బంచి స్వామి, రమణ స్వామి, మల్లేష్ స్వామి, శ్రీను స్వామి, నరేష్ స్వామి,పాండు స్వామి మరియు రాము నాయక్, తుల్సి రాం నాయక్, సాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు

# అమ్రాబాద్ మండలంలో కాంగ్రెస్ దే ఆధిక్యం

**అమ్రాబాద్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో చివరి విడత పోలింగ్ పూర్తయి, అమ్రాబాద్ మండలంలో గెలుపొందిన సర్పంచుల జాబితా వెలువడింది.ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు అధిక గ్రామాల్లో విజయం సాధించారు. అమ్రాబాద్ గ్రామంలో చిగుర్లకోటయ్య, మన్ననూర్‌లో విస్లావత్ మంజుల, జంగం రెడ్డిపల్లిలో వక్రావత్ రజిత, కొత్తపల్లిలో రమావత్ శాంతమ్మ, మాచారంలో ఉడుతనూరి పుష్ప,



మాధవానిపల్లిలో దాసరి స్వరాజ్యలక్ష్మి, తుర్కపల్లిలో పంబలి చంద్రమౌళి, బ్రహ్మగిరిలో ఉడతల మల్లేష్, వెంకటేశ్వర బాయిలో దాసరి ఎల్లమ్మ, సార్లపల్లిలో చిర రాములు కాంగ్రెస్ మద్దతుతో విజయం సాధించారు.అదేవిధంగా టిఆర్ఎస్ మద్దతుదారులు కూడా కొన్ని గ్రామాల్లో గెలుపొందారు. బి.కే. లక్ష్మాపూర్‌లో జయరాం, బి.కే. తిరుమలాపూర్, ఓటువర్లపల్లి, తెలుగు పల్లి గ్రామాల్లో పాల్వాయి శ్రీదేవి టిఆర్ఎస్ మద్దతుతో విజయం సాధించారు.అమ్రాబాద్ మండలంలో కాంగ్రెస్ ఆధిక్యం స్పష్టంగా కనిపించగా, టిఆర్ఎస్ కూడా తన స్థానం నిలబెట్టుకుంది.

# అయ్యప్పఆశీర్వాదాలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



**వనపర్తి,డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బి.ఆర్.ఎస్ నాయకుడు చీర్ల విష్ణుసాగర్ స్వామి స్వగృహంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలధారణ పూర్వజన్మ సుకృతమని, కలియుగ దైవం అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.పూజ అనంతరం గురుస్వామి ముత్తుకృష్ణ, విష్ణు స్వామిని సన్మానించి గురుస్వాములచే తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్ స్వామి, ప్రేమ్ నాథ్ రెడ్డి, ఇమ్రాన్, బాగ్యరాజ్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం గ్రామంలో టేకు అనిల్ బీజేపీలో చేరిక



**మానకొండూరు, డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూరు నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి, గన్నేరువరం గ్రామ 6వ వార్డు సభ్యుడు టేకు అనిల్ గారు, తనతో పాటు 20 మంది కార్యకర్తలతో కలిసి ఈరోజు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా టేకు అనిల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరిట ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు అని, రెండేళ్లలో ఇచ్చిన హామీలను తప్పించి ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాయ మాటలు, వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతోందని, తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు.అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటిని తమ కృషిగా చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని పేర్కొన్నారు. గన్నేరువరం మండల అభివృద్ధికి కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కట్టుబడి ఉన్నారని, ముఖ్యంగా మానేరు నది పై వంతెన నిర్మాణం కోసం ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మచ్చ బాలరాజు, సందవేణి ప్రశాంత్ యాదవ్, జాలి శ్రీనివాస్ రెడ్డి, 8వ వార్డు సభ్యుడు మచ్చ సాయికృష్ణ, కాంతల మధుకర్ రెడ్డి, పుల్లెల జగన్, కుర్ర హరీష్, బోయిని వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు మండలంలో మూడో విడత సర్పంచ్ ఎన్నికల ఫలితాలు




**ఎలిగేడు, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలో మూడో విడత సర్పంచ్ ఎన్నికలు ఉత్సాహభరితంగా ముగిశాయి. మొత్తం 12 గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఖరారయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి 10 స్థానాలను గెలుచుకుంది. బిఆర్ఎస్ ఒక్క గ్రామంలో విజయం సాధించగా, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానాన్ని దక్కించుకున్నారు.బూరహన్‌మియాపేటలో గోప్ప రజిత, ధూళికట్టలో మారం కొమురయ్య, నర్సాపూర్‌లో పల్లెర వెంకటేష్ గౌడ్, నారాయణపల్లెలో రంగు లత శ్రీను, లాలపల్లెలో ఏలేటి వెంకట్ రెడ్డి, శివపల్లెలో దుగ్యాల వాణి రాంగోపాల్‌రావు, లోకపేటలో రాధ గంగజమున, రాములపల్లెలో సిద్ధి తిరుపతి, ర్యాకల్దేవ్‌పల్లెలో మద్దెల రమ సంపత్, ముప్పిరితోటలో రామిడి శైలజ వెంకట్రామిరెడ్డి కాంగ్రెస్ తరఫున గెలుపొందారు.సుల్తాన్‌పూర్‌లో కవ్వంపల్లి బాపయ్య బిఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. ఎలిగేడు గ్రామంలో కప్పల ప్రవీణ్ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు.ఈ ఫలితాలతో ఎలిగేడు మండలంలో కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టమైంది. ప్రజల విశ్వాసాన్ని పొందిన అభ్యర్థులు గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తమవుతోంది

# కాంగ్రెస్‌లో చేరిన మహాత్మానగర్, చింతగుట్ట సర్పంచులు





**తిమ్మాపూర్, డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామ సర్పంచ్ కర్క చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పొన్నాల సంపత్, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిపై విజయం సాధించారు. రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పనితీరు, కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చి, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నాయకత్వంలో పని చేయాలనే సంకల్పంతో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే సత్యనారాయణ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, గోపు మల్లారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే, శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామ సర్పంచ్ కర్క చంద్రశేఖర్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వాగౌడ్, పార్టీ నాయకులు కర్క అనంతరెడ్డి, గంగుల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయానికి రాగా, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు.

# సమాచార హక్కు చట్టం నిర్వీర్యమవుతుందా..?










**- రాపోలు లింగస్వామి**

**ఎల్‌బీ నగర్, డిసెంబర్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు పునాది అయిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమల్లోకి వచ్చి 21 సంవత్సరాలు గడుస్తున్నా, నేటికీ సామాన్య ప్రజలకు అది అందని ద్రాక్షలా మారిందని ఆర్‌టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్స్ గ్రహీత, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్ గ్రహీత రాపోలు లింగస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన బుధవారం పర్యటించి, ఆర్‌టీఐ సూచిక బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అనేక కార్యాలయాల్లో అసంపూర్ణ వివరాలు, కొన్ని చోట్ల ఫోన్ నంబర్లను కాగితాలతో మూసివేసిన బోర్డులు దర్శనమిచ్చాయని, ఇది చట్టాన్ని అమలు చేస్తున్న తీరు కాదని, కేవలం పేరుకే ఉన్న ఏర్పాట్లుగా ఉన్నాయని విమర్శించారు.ఇలాంటి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే కాదా? అని ప్రశ్నిస్తూ, తక్షణమే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పూర్తి సమాచారంతో కూడిన ఆర్‌టీఐ సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు.“రాజధాని హైదరాబాద్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే, గ్రామ స్థాయిలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు” అని వ్యాఖ్యానించిన లింగస్వామి, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆర్‌టీఐ అంటే ఏమిటి, ఏ కార్యాలయంలో ఎవరి వద్ద సమాచారం కోరాలి, దరఖాస్తు ఎలా చేయాలి అనే విషయాలపై సరైన అవగాహన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఉన్న గొప్ప వజ్రాయుధమని, అవినీతిని ప్రశ్నించే శక్తిని సామాన్యుడికి అందించిన చట్టమని గుర్తుచేసిన ఆయన, అంతటి గొప్ప చట్టాన్ని ఆచరణలో నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించి, సమాచార హక్కు చట్టాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

# లష్కర్ గూడ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తా

**సర్పంచ్ అల్లే అయిలయ్య యాదవ్**

**అబ్దుల్లాపూర్ మెట్. డిసెంబర్ 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ లోని లష్కర్ గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అల్లే అయిలయ్య యాదవ్ 240 ఓట్లతోని ఘన విజయం సాధించడం జరిగింది అనంతరం అల్లే ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతోని ఓట్లు వేసి గెలిపించిన ఓటర్ మహాశయులకు నా గ్రామ ఓటర్ మహాశయులకు ధన్యవాదాలు తెలుపుకుంటాను ఎప్పటికప్పుడు గ్రామంలో సమస్యను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తానని వార్డుని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆమె చెప్పడం జరిగింది

# మహబూబాబాద్‌లో డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం

**- ఎమ్మెల్యే మురళీ నాయక్**



**మహబూబాబాద్, డిసెంబర్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ పట్టణంలో అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఏ.వి. డయాగ్నస్టిక్ సెంటర్ ను ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్, డిసిసి అధ్యక్షురాలు డా. భూక్యా ఉమా మురళీ నాయక్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ, “పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలి” అని డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులను కోరారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.







# కాంత చిత్రానికి థియేటర్లలో ఫ్లాప్ టాక్..

## కానీ ఓటీటీలో ఇంప్రెసివ్ రెస్పాన్స్

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది.తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది.ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.

# మోహన్‌లాల్ 'వృషభ' ట్రైలర్ విడుదల

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రధాన పాత్రలో నటించిన పాన్-ఇండియా చిత్రం 'వృషభ'. హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాను నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. ఏక్తా కపూర్ (బాలాజీ టెలిఫిల్మ్స్), ఏవీఎస్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం తెలుగు, మలయాళం, హిందీ, తమిళం మరియు కన్నడ భాషల్లో డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ ట్రైలర్ చూస్తుంటే.. మోహన్ లాల్ ఇందులో రెండు విభిన్న పాత్రలలో కనిపించబోతున్నాడు. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ ట్రైలర్‌ను మీరు చూసేయండి.










# రజినీకాంత్ జైలర్ 2 క్రేజీ టాక్..

### కావాలయ్యా మ్యాజిక్‌ను నోరా ఫతేహి రిపీట్ చేయనుందా..?

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న క్రేజీ సీక్వెల్ జైలర్ 2 . కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ ఇచ్చాడని తెలిసిందే.జైలర్‌లో తమన్నాపై వచ్చే నువ్ కావాలయ్యా సాంగ్ నెట్టింటిని ఓ ఊపు ఊపేసింది. జైలర్ 2లో కూడా ఈ సాంగ్ లైన్స్‌లోనే మరో పాట కూడా ఉండబోతుంది. బాలీవుడ్ భామ నోరా ఫతేహి స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. జైలర్ 2 స్పెషల్ సాంగ్‌ను ప్రస్తుతం చెన్నైలో షూట్ చేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. మరి కావాలయ్యా క్రేజ్, మ్యాజిక్‌ను సీక్వెల్‌లో తెరకెక్కిస్తున్న సాంగ్ రీక్రియేట్ చేస్తుందా..? అనేది ఆసక్తికరంగా మారింది. నోరా ఫతేహి డ్యాన్స్ అంటే ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ భామ సిల్వర్ స్క్రీన్‌పై ఎలా మెరువతుందో చూడాలి మరి. జైలర్ 2 ఇటీవలే గోవాలో షూటింగ్ జరుపుకోగా.. ఈ షెడ్యూల్‌లో విజయ్ సేతుపతిపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్.సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ విజయ్ సేతుపతి కీలక పాత్రల్లో నటిస్తున్నారని సమాచారం. మేకర్స్ నుంచి అఫీషియల్ అప్‌డేట్ రావాల్సి ఉంది. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించగా సీక్వెల్‌లో వారి పాత్రలు కొనసాగింపు ఉంటుందా..బీ? అనేది సస్పెన్స్ నెలకొంది.

# లైన్‌లోకి టాప్ కంపెనీలు..

## ఆదిసాయికుమార్ శంబాలపై పెరుగుతున్న హైప్

టాలీవుడ్ యాక్టర్ ఆదిసాయికుమార్ నటిస్తోన్న తాజా చిత్రం శంబాల . ఈ చిత్రానికి ఏ యాడ్ ఇన్‌ఫినిటీ ఫేం యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నాడు. అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తుంది.వివిధ ప్రాంతాల్లో ఈ చిత్రాన్ని టాప్ డిస్ట్రిబ్యూషన్ హౌస్‌లు పంపిణీ చేస్తున్నాయి. నైజాం ఏరియాలో ఈ చిత్రాన్ని మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పీ విడుదల చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్, సీడెడ్ ఏరియాల్లో ఉషా పిక్చర్స్, విదేశీ మార్కెట్, కర్ణాటకలో మూన్‌షైన్ సినిమాస్, కుమార్ బెంగళూరు ఫిలిమ్స్ ఓవర్సీస్‌లో విడుదల చేయనున్నాయి. శంబాల చిత్రాన్ని టాప్ కంపెనీలు విడుదల చేస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రంలో లబ్బర్ పండు ఫేం స్వసిక, రవి వర్మ, మధునందన్, శివ కార్తీక్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా శంబాల ఓటీటీ పాపులర్ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహా దక్కించుకోగా.. తెలుగు శాటిలైట్ రైట్స్‌ను జీ దక్కించుకుంది. ఇప్పటికే ఆది సాయికుమార్ టీం షేర్ చేసిన శంబాల రషెస్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. సూపర్ న్యాచురల్ థ్రిల్స్, ఇలాంటి ప్రపంచాన్ని నిర్మించడం తొలిసారి.. స్టన్నింగ్ విజువల్స్, ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, వీఎఫ్ఎక్స్ పార్ట్‌తో భారీగా స్థాయిలో రాబోతున్నాం.. అంటూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు మేకర్స్. ఈ మూవీని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్, అన్నభీమోజు, మహిధర్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ రాబోతున్న ఈ మూవీలో ఆది జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నాడని సమాచారం. ఈ మూవీకి శ్రీమ్ మద్దూరి సంగీతం అందిస్తున్నారు